# ఈనాడు మహబూబాబాద్

సోమవారం ఆగస్టు 31, 2026 5


## మానుకోటలో బోనాల సందడి



కొత్త బజార్‌లో ముత్యాలమ్మ ఆలయం వద్ద

మానుకోటలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కొత్త బజార్ ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలోని ముత్యాలమ్మ ఆలయంతో పాటు శిఖార్‌ఖానగడ్డ ముత్యాలమ్మ ఆలయాలు సందడిగా మారాయి. పట్టణ పోలీసు సిబ్బంది స్థానిక ముత్యాలమ్మ ఆలయాల వద్ద బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, మహబూబాబాద్ టౌన్

## కాలువ తీరు.. రాని నీరు!



ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు సరిగా కురవడం లేదు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు వచ్చినా.. పిచ్చి మొక్కలు, గడ్డి విపరీతంగా అడ్డుపడే ప్రమాదం ఉంది. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో కాలువల్లో గడ్డి పెరిగి పశువులకు మేతగా మారింది. ఇనుగుర్తి సమీపంలోని ఎస్సారెస్పీ 10ఆర్1 కాలువ తీరు ఇది. – న్యూస్‌టుడే, ఇనుగుర్తి

# గ్యాస్‌కు కొత్త భారం

**మరిపెడ, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల్లో ఎల్పీజీ వినియోగం భారీగా పెరిగింది. గ్యాస్ కొత్త కనెక్షన్ తీసుకోవడం, సిలిండర్ రీఫిల్ చేయడం, డెలివరీ ఛార్జీల వంటి అంశాలు సామాన్య కుటుంబాలకు భారంగా మారింది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు నెలవారీ ఖర్చుల్లో గ్యాస్ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ కొరత, సిలిండర్ బుకింగ్ గడువు పెంపు ప్రభావంతో కొత్త కనెక్షన్ దరఖాస్తులు పెరిగేందుకు దారి తీసింది. మార్చి నుంచి చమురు సంస్థలు కొత్త కనెక్షన్ల జారీ ప్రక్రియ నిలిపివేశాయి.

**గతంలో ఒక్క రోజులోనే..**

గతంలో దరఖాస్తు చేసిన ఒక్క రోజులోనే కొత్త గ్యాస్ కనెక్షన్ల కోసం దానితోపాటు డబుల్ సిలిండర్ సైతం ఇచ్చేవారు. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు తగ్గినా ఆ ప్రభావం గ్యాస్ సరఫరాపై కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా నూతన గ్యాస్ కనెక్షన్లు, రెండో సిలిండరు మంజూరు నిలిపివేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. నూతన కనెక్షన్ మంజూరు చేయాలని గృహావసరాల వినియోగదారులు ఏజెన్సీ కార్యాలయాల్లో అర్జీలు సమర్పిస్తున్నారు. వీరందరికీ నాలుగు నెలలుగా వెబ్‌సైట్ పని చేయకపోవడంతో నిరీక్షణే మిగిలింది. డీలర్లు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కొత్తగా పెళ్లయిన జంటలకు కనెక్షన్ పొందడం ఇబ్బందిగా మారింది.

| జిల్లా | ఐఓసీఎల్ | హెచ్‌పీసీఎల్ | బీపీసీఎల్ | మొత్తం |
|---|---|---|---|---|
| మహబూబాబాద్ | 56200 | 77000 | 64900 | 197100 |



మరిపెడలో గ్యాస్ రీఫిల్ కోసం

**ఏజెన్సీ కార్యాలయాలకు పరుగులు**

కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తుదారులు పట్టణాలు, మండల కేంద్రాల్లోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. డీలర్ల చుట్టూ తిరిగే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పట్లో మంజూరయ్యేలా లేవని, ఎప్పుడిస్తారో తెలియదని చెబుతుండడంతో దరఖాస్తుదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ గ్యాస్ కనెక్షన్ల మంజూరు అంశం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు. వెబ్‌సైట్ ఓపెన్ అయితే ప్రక్రియ మొదలయ్యే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో 13.88 లక్షలు**

మహబూబాబాద్, వరంగల్ హనుమకొండ, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల్లో మొత్తం 13.88 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లున్నాయి. జిల్లాల వారీగా చూస్తే హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 4.35 లక్షల వినియోగదారులున్నారు.

# విద్యా బలోపేతానికి బాటలు

**జవాబు పత్రాల మూల్యాంకనంలో కొత్త విధానం**

**మానుకోట, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో 1-9వ తరగతి విద్యార్థులకు అర్ధవార్షిక, వార్షిక పరీక్షలుగా భావించే సంగ్రహణాత్మక మూల్యాంకన విధానంలో పాఠశాల విద్యాశాఖ నూతన విధానాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనుంది. ఎస్ఏ 1,2 పరీక్షల సంబంధించి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఇప్పటివరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే చేసేవారు. ఇకపై ఎక్స్‌టర్నల్ ఏవాల్యుయేషన్ సిస్టం పేరిట అమలు కానుంది. నూతన విధానంలో ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తారు. మార్కుల కేటాయింపులో పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పక్షపాతత, ఏకరూపత, కచ్చితత్వం పెంపొందించేందుకే ఈ విధానం దోహదపడుతుందని భావిస్తున్నారు.

- ఎప్పటి లాగే ఎస్ఏ 1,2 పరీక్షల నిర్వహణ ఆయా పాఠశాలల్లోనే జరుగుతుంది. సమాధాన పత్రాలను మాత్రం ప్రధానోపాధ్యాయుడు సంబంధిత మండల వనరుల కేంద్రానికి (ఎమ్మార్సీ)పంపుతారు. వీటిని అదే మండలానికి చెందిన ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తారు. ఎంఈఓలు మూల్యాంకన ఇన్‌ఛార్జీలు నియమిస్తారు. మూల్యాంకనం చేసేందుకు ఉపాధ్యాయులను నియమిస్తారు. మూల్యాంకన ప్రక్రియ మూడు నుంచి ఐదు రోజుల్లో పూర్తి చేయాలి. ఆన్‌లైన్‌లో మార్కులను నమోదు చేయాలి.

**ఉమ్మడి జిల్లా గణాంకాలు..**

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| భూపాలపల్లి | 414 | 18,970 |
| మహబూబాబాద్ | 762 | 40,109 |
| ములుగు | 473 | 18,410 |
| హనుమకొండ | 492 | 30,763 |
| జనగామ | 408 | 29,837 |
| వరంగల్ | 724 | 32,661 |

● జిల్లా ● పాఠశాలలు ● విద్యార్థులు

- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో సమాధాన పత్రానికి రూ. రెండు, ఉన్నత తరగతులకు రూ.మూడు చొప్పున పారితోషికం చెల్లిస్తారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసే మూల్యాంకన శిబిరాల నిర్వహణకు రూ.10 వేలు కేటాయిస్తారు. ఈ మేరకు జిల్లాల వారీగా నిధుల కేటాయింపు అంచనాలను విద్యాశాఖ సిద్ధం చేసింది.

## ఆయిల్‌పామ్ పరిశ్రమ పనులు ప్రారంభించాలని డిమాండ్

**తొర్రూరు, న్యూస్‌టుడే:** తొర్రూరు మండలం గోపలగిరి గ్రామశివారులో ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. తొర్రూరు వ్యవసాయ మార్కెట్‌లో ఆయిల్‌పామ్ గెలలను ఆదివారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నాడు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణానికి రూ. 100 కోట్లు మంజూరైతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేవలం కుట్రపూరితంగానే పరిశ్రమ నిర్మాణ పనులను పక్కనపెట్టారన్నారు.



ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న మాజీమంత్రి దయాకర్‌రావు

ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. భారాస మండలాధ్యక్షుడు సీతారాములు, నాయకులున్నారు.



# యువతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ అధికారులు, నేతలు

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటూ సహాయ సహకారాలను అందిస్తుందని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు ఉద్యోగ నియామకాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో వేం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుమూల ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా శిక్షణ ఇప్పిస్తున్న ఎస్పీ శబరీష్‌ను నరేందర్‌రెడ్డి అభినందించారు. ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు నైపుణ్యం కలిగిన శిక్షణా సంస్థ నుంచి బోధకులను నియమించామన్నారు. 1,056 మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి వారిలో 500 మందిని ఎంపిక చేసి ఉచిత వసతితో రెండు నెలలు శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు అవసరమైన పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, కలెక్టర్ స్నేహాశబరీష్, డీఎస్పీ తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు గుగులోత్ జ్యోతి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల తీరుపై ఆరా

**కేసముద్రం రూరల్, న్యూస్‌టుడే:** కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. వట్టివాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన, పాఠశాల నూతన భవనం, రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి స్థానికులతో చర్చించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయించాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంట సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ తదితరులున్నారు.





# ప్రత్యేక తరగతుల భత్యం పక్కదారి

**రూపాయి ఇవ్వలేదు..**

చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి గణితం, సైన్స్‌లో ఫెయిల్ అయ్యాడు. నర్సంపేటలోని జడ్పీహెచ్ఎస్(బాలికలు)లో రెమిడియల్ తరగతులకు హాజరయ్యాడు. పది సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణుడై.. ప్రస్తుతం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందాడు. రూ. 1000 ఇస్తామని చెప్పి నేటి వరకు చెల్లించలేదని వాపోయాడు.

**వివరాలు తీసుకున్నారు..**

వరంగల్ మండలానికి చెందిన ఓ విద్యార్థి గణితంలో తప్పాడు. కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రెమిడియల్ తరగతులకు హాజరయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణుడై ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాడు. 'ప్రభుత్వం నుంచి మీకు రూ.1000 వస్తాయని పాఠశాల సిబ్బంది బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు చెల్లించలేదు. దీనిపై అడిగితే స్పందించడం లేదని' విద్యార్థి తండ్రి తెలిపారు.

**వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే:** పదో తరగతి వార్షిక పరీక్షల్లో తప్పినవారు సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక తరగతులు(రెమిడియల్) నిర్వహించింది. ఆ తరగతులకు హాజరైన వారికి ఒక్కొక్కరికి రూ.1000 రవాణా భత్యం, నోటు పుస్తకాలు, పెన్నుల కోసం రూ.100 కేటాయించింది. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి 378 మంది అనుత్తీర్ణులయ్యారు. వీరికి ప్రభుత్వం కేటాయించిన రూ.4.15 లక్షల నిధులను జిల్లా విద్యాశాఖ అధికారులు పక్కదారి పట్టించారు.

**నిఘా**

జిల్లాలో రెమిడియల్ తరగతుల కోసం విద్యాశాఖ అధికారులు రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో ఒకటి వరంగల్ కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ఉన్నత పాఠశాల, రెండోది నర్సంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల. మే 12 నుంచి జూన్ 3వ తేదీ వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.

**రూ.4.15 లక్షలు స్వాహా..**

జిల్లా నుంచి పరీక్షలకు హాజరైన 378 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1100 చొప్పున రూ. 4,15,800లను ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారి ఖాతాలో జమ చేసింది. డీఈవో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి.. వారి ఖాతాలకు నగదు బదిలీ చేయాల్సింది. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా.. రూపాయి చెల్లించలేదు.

**ఆరోపణలు వస్తున్నా..**

జిల్లా విద్యాశాఖ కార్యాలయంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేసే కొంత మంది అధికార, సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్లు బహిరంగంగానే విమర్శలున్నాయి. కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల నుంచి ప్రతి పనికి కొంత మొత్తం వసూలు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి జిల్లా విద్యాశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

# సర్దుబాటుకు ససేమిరా..!

**పాఠశాలల్లో చేరని పలువురు ఉపాధ్యాయులు**

**నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే:** విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచాక జిల్లాలో ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను నిర్వహించింది. జిల్లాలో 77 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ), 31 మంది స్కూల్ అసిస్టెంట్లను వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేశారు. తొలుత మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో ఏ పాఠశాలలో మిగులు ఉపాధ్యాయులున్నారు.. పని సర్దుబాటుపై ఈ నెల 20న జిల్లా విద్యాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటేషన్ ఉత్తర్వులు అందిన ఉపాధ్యాయులు ఈ నెల 21వ తేదీన తమకు కేటాయించిన బడుల్లో చేరాలని అందులో పేర్కొన్నారు.

**అనారోగ్య సమస్యలను చూపుతూ..**

పని సర్దుబాటు ఉత్తర్వులు జారీ చేసి పది రోజులు కావస్తున్నప్పటికి చాలా మంది తమకు కేటాయించిన బడుల్లో ఇప్పటి వరకు చేరలేదు. పలువురు ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యలను కారణంగా చూపుతూ జిల్లా అధికారులకు అర్జీలు పెట్టుకున్నట్లు తెలిసింది. డిప్యూటేషన్ ఇచ్చిన ఉపాధ్యాయుల్లో చేరనివారు, కారణాలను మండల విద్యాశాఖాదికారుల నుంచి వెంటనే సేకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి జిల్లా సమగ్రశిక్ష ఏఎంవో వెంకటేశ్వర్లును ఆదేశించారు. శనివారం నాటికి కూడా ఈ విషయంపై కొందరు ఎంఈఓల నుంచి వివరాలు రాలేదని సమాచారం. కాగా, పలు పాఠశాలల్లో పని సర్దుబాటు జరిగినా ఉపాధ్యాయులు చేరకపోవడంతో బోధనకు ఆటంకం కలుగుతోంది.

**ప్రక్రియపై విమర్శలు**

జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు కూడా నిబంధనలకు అనుగుణంగా జరగలేదనే విమర్శలున్నాయి. అలాంటిదేమి జరగలేదని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి 'న్యూస్‌టుడే'కు స్పష్టం చేశారు.

# వర్షాభావం.. సాగు భారం

**మానుకోట, మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే:** ఎల్‌నినో ప్రభావం జిల్లాను వెంటాడుతోంది. వర్షాకాలం ప్రారంభమైన మూడు నెలల్లో అప్పుడప్పుడు జల్లుల్లాంటి వర్షాలు తప్ప భారీ వర్షాల జాడ లేదు. ఫలితంగా జిల్లాలో చెరువులు, కుంటలు నిండక వెలవెలపోతున్నాయి. గత సంవత్సరం ఈ సమయానికి పలు చెరువులు నిండాయి. కొన్ని చెరువులు మత్తడి పడ్డాయి. కాగా వర్షాలు కురిసి చెరువులు నిండుతాయని ఆశలు పెట్టుకుని ప్రధానంగా వరి సాగు చేస్తున్న రైతుల ఆశలు చివరికి అడియాసలవుతాయా అనే సందేహం వ్యక్తమవుతోంది. కొందరు రైతులు వ్యవసాయ బావుల్లో వేలాది రూపాయలు వ్యయం చేసి పూడికలు తీయించారు. అయితే వర్షాభావం వల్ల భూగర్భ జలాల అభివృద్ధి కూడా సమస్యగానే మారింది.

జలంతో కళకళలాడాల్సిన చెరువులన్నీ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో వెలవెలబోతున్నాయి. కొత్తగూడ మండలం సాధిరెడ్డిపల్లి, ఓటాయి, పొగుళ్లపల్లి చెరువుల ద్వారా ఏటా వేలాది ఎకరాల్లో వరి సాగయ్యేది. ఈ ఏడాది ఆగస్టు మాసం పూర్తికావస్తున్నప్పటికీ నీళ్లు లేక పొలాలన్నీ బీడు భూములుగా మారాయి. గతేడాది ఆగస్టు చివరలో మత్తడిపోస్తూ జలంతో కళకళలాడిన చెరువులన్నీ ఎడారిలా మారిన తీరు కొత్తగూడ ఏజెన్సీలో నెలకొంది. – న్యూస్‌టుడే, కొత్తగూడ



సాధిరెడ్డిపల్లి చెరువు ఇలా

**అధికంగా 25 శాతం లోపే..:** తాజా సమాచారం ప్రకారం..జిల్లాలో మొత్తం చెరువులు 1,590 ఉండగా 700 చెరువుల్లో 25 శాతం నీరు కూడా రాలేదు. అలాగే 25-50 శాతం లోపు నిండినవి 593 ఉన్నాయి. 50-75 శాతం లోపు 54 ఉన్నాయి. 75 నుంచి 100 శాతం లోపు నిండిన చెరువులు 241 మాత్రమే. ఇక సమృద్ధిగా జలాలు వచ్చిన చెరువులు రెండు మాత్రమే ఉన్నాయి.

**లోటు వర్షపాతమే**

జిల్లాలో జూన్ ఒకటి నుంచి ఆగస్టు 30 వరకు లోటు వర్షపాతంతోనే కొనసాగుతోంది. జిల్లాలో 4 మండలాలు సాధారణ వర్షపాతంతో 14 మండలాలు లోటు వర్షపాతంతో ఉన్నాయి.



# ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర..!

● **నేడు నారాయణపురం రైతులకు భూపట్టాలు**

**కేసముద్రం రూరల్, న్యూస్‌టుడే:** కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతుల ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. వందలాది మంది రైతులు భూపట్టాల కోసం చేస్తున్న ఉద్యమానికి ఫలితం దక్కనుంది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థలో చోటు చేసుకున్న లోపాల కారణంగా తమ భూములపై హక్కులను కోల్పోయిన రైతుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. 2017లో ధరణి భూ రికార్డుల ప్రక్షాళన నేపథ్యంలో నారాయణపురంలో అధిక సంఖ్యలో రైతుల పట్టా భూములు అటవీ భూములుగా నమోదయ్యాయి. రైతుల పేర్లు భూ రికార్డుల నుంచి తొలగిపోగా, పట్టాదారు పాసుపుస్తకాలు చెల్లుబాటు కాలేదు. తరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై తమ హక్కులు నిరూపించుకునే పరిస్థితి ఏర్పడింది. రైతుబంధు, బ్యాంకు రుణాలు రాక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో రైతులంతా ఆందోళనలు, ధర్నాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం హక్కులను పునరుద్ధరించే ప్రక్రియను చేపట్టింది. ఈమేరకు రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఈమేరకు నారాయణపురం గ్రామానికి చెందిన 780 మంది రైతులకు సోమవారం కేసముద్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి పట్టాలు పంపిణీ చేయనున్నారు.

ఈ విషయమై ఎంపీటీసీ మాజీ సభ్యుడు ధారావత్ రవినాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పట్టా భూమిపై హక్కు మాత్రమే కాదు, తమ ఆత్మ గౌరవానికి కూడా గుర్తింపు అని పేర్కొన్నారు. గ్రామంలో పలువురి భూమి అటవీ భూమిగా నమోదు కావడంతో, పట్టాదారు పాసు పుస్తకం లేక ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాం. మళ్లీ మా చేతికి పట్టా వస్తుండటం ఆనందంగా ఉందన్నారు.



నారాయణపురం గ్రామ పంచాయతీ కార్యాలయం

## షట్లర్ కీర్తికి రజత పతకం



**వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** ఓరుగల్లు యువ సంచలనం షట్లర్ కీర్తి రజత పతకంతో అదరగొట్టింది. ఈ నెల 25 నుంచి 30 వరకు మహారాష్ట్రలో పుణె అంతర్జాతీయ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో బాలికల డబుల్స్ విభాగంలో బరిలోకి దిగిన మంచాల కీర్తి అద్భుతమైన ప్రదర్శనతో థాయ్‌లాండ్ జట్టుపై రన్నరప్‌గా నిలిచింది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న కీర్తిని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు డా. రమేశ్‌కుమార్, పింగిళి రమేశ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## వైద్య విద్యార్థుల సేవార్థ్

**ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే:** నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టడంతో పాటు ఖాళీ సమయంలో సామాజిక సేవ చేస్తున్నారు పలువురు వైద్య విద్యార్థులు. కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ) విద్యార్థులు రక్తదానంపై 'బ్లడ్ డోనర్స్ క్లబ్', గ్రామీణుల ఆరోగ్య సమాచారం, సేవల కోసం 'గ్రామాల దత్తత', ఏజెన్సీ ప్రాంత వాసులకు వైద్య సేవలు అందించడానికి 'ఆరోగ్య మిత్ర యాత్ర' పేరిట వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. 'సేవార్థ్ క్లబ్' పేరిట ఏడాదిగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. గతేడాది ఫైనలియర్ విద్యార్థులు ఈ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు ఉత్సాహంగా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్య విద్యార్థులు

సమాజంలో అపోహలు, మూఢ నమ్మకాలు పోగొట్టడానికి ద్వితీయ సంవత్సరం 'సేవార్థ్' కార్యక్రమాన్ని నిర్వహించడానికి సమాయత్తమైంది. వాస్తవ పరిస్థితులు తరగతి గదులలో, ఆసుపత్రులలో పరిమితం కాకుండా సమాజంలో ముందుండడానికి ఈ క్లబ్ సభ్యులు కృషి చేస్తున్నారు.

**ముఖ్యోద్దేశం ఇదీ..**

శాస్త్రీయమైన వైద్య సమాచారం సామాన్య ప్రజలకు చేరవేయడం, అపోహలను తొలగించడం, ఆరోగ్యంపై సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రజలను చైతన్య పరిచి, అవసరమైన వారికి అండగా నిలవడమే క్లబ్ ముఖ్య ఉద్దేశం.

**కార్యవర్గం ఎవరెవరంటే..**

సేవార్థ్ క్లబ్ అధ్యక్షుడిగా ఆర్‌కే.శ్రీరాంరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా కె.సాహితి, ప్రధాన కార్యదర్శులుగా టి.వంశీ, పి.దీప్నా, కోశాధికారిగా సంచిత పాటిల్, సోషల్ మీడియా బాధ్యుడిగా జయానంద్, సభ్యులుగా ఉషశ్రీ, అలీ, ఆకాంక్ష, శ్రీజ, సేహారిక, నీరజ్, శ్రీశైలం ఉన్నారు. గతేడాది సేవార్థ్ క్లబ్ కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షురాలిగా అనన్య, కార్యదర్శిగా సుధాంశ్‌రెడ్డి, సభ్యులుగా హేమాంగిని, రామకృష్ణ పనిచేశారు.

**మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం..**



సమయం దొరికినప్పుడల్లా సమాజాన్ని చైతన్యపర్చే కార్యక్రమాలు పెట్టుకుంటున్నాం. ఆరోగ్యపరమైన విషయాల్లో ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సి ఉంది. అపోహలు తొలగిపోయేలా మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.
– ఆర్‌కే.శ్రీరాంరెడ్డి 'సేవార్థ్' క్లబ్ అధ్యక్షుడు

**చేపట్టిన కార్యక్రమాలు..:** ☛ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు విద్యార్థులకు నీడిల్ స్టిక్ గాయాల నివారణ విధానం, పరిశుభ్రతపై కార్యక్రమాల నిర్వహణ. ☛ 2025 ఆగస్టు 30న ఒక్కరోజే 9 పాఠశాలల్లో 470 మంది విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ. ☛ 5 ఆగస్టు 2025న వరల్డ్ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యం వివరిస్తూ.. 300 మంది విద్యార్థులతో 'హెల్త్ రన్' కార్యక్రమం. ☛ కౌమార దశలోని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు 2025 జూన్ 27న హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, 19 జూన్ 2025న, 18 జులై 2026న ప్రైవేటు విద్యా సంస్థలో చేపట్టారు. ☛ 6 ఆగస్టు 2026 రోజున ఎమర్జెన్సీ మెడికల్ అవేర్‌నెస్ కార్యక్రమం వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించారు. రైల్వే సిబ్బందికి, పోలీసులు, కూలీలకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు.

## ఆలయ సమాచారం

✦ భద్రకాళి ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, శ్రీభద్రేశ్వర స్వామికి అభిషేకం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మహా మండపంలో విశిష్ట కుంకుమార్చనలు జరుగుతాయి. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి మహాన్యాస పూర్వక పశుపతి రుద్రాభిషేకాలు జరుగుతాయి. శ్రావణ మాసం ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి అర్చనలు. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండలోని చారిత్రక హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో శ్రావణ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 5:00 గంటలకు పరివార దేవతామూర్తులకు అభిషేకం ఉంటుంది. ఉదయం 7:00 గంటల వరకు మహా మంగళహారతి, 7:15 గంటల నుంచి కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6:30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం ఉంటుంది.

✦ కాళేశ్వర క్షేత్ర ఆదిముక్తీశ్వర బాలాలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు ద్విలింగాలకు మహాన్యాస రుద్రాభిషేకం, ఉదయం 8 గంటలకు రూ.1000ల ప్రత్యేక అభిషేకాలు, 10.30కు శుభానంద, ముక్తీశ్వర స్వామికి నిత్య కల్యాణం, రాత్రి 7 గంటలకు జ్ఞాన సరస్వతీ ఘాట్ వద్ద కాళేశ్వరం అర్చకులచే త్రిహారతి, రాత్రి 8 గంటలకు ఆలయ ద్వార బంధనం ఉంటుంది.

– న్యూస్‌టుడే, రంగంపేట, హనుమకొండ సాంస్కృతికం, కాళేశ్వరం

## గోదావరిలో 'పెద్ది' అస్థికల నిమజ్జనం



సుదర్శన్‌రెడ్డి సంతాప సభలో పాల్గొన్న నాయకులు

**భద్రాచలం, న్యూస్‌టుడే:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్థికలను ఆదివారం భద్రాచలం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. కుటుంబ సభ్యులతో పాటు ఆ నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అస్థికలను నదిలో కలిపారు. దీనికి ముందు స్నానాల ఘాట్‌లో పురోహిత సంఘం అధ్యక్షుడు రామావఝుల రవికుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్థానికంగా ఉన్న ఓ సత్రంలో సంతాప సభను నిర్వహించారు. సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి స్వప్న, కుమారుడు నిదర్శన్‌రెడ్డి, కుమార్తె ధర్మిష్టారెడ్డితో పాటు నాయకులు నివాళులర్పించారు. గత నెల 31న సుదర్శన్‌రెడ్డి మృతి చెందారని.. అతడి మరణం తీరని లోటన్నారు. తెలంగాణ ఉద్యమ కెరటంగా పోరాటం సాగించారని, భారాసలో కీలక నేతగా ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు.

## ఉన్నత విద్యకు ఉపకార వేతనం

**హసన్‌పర్తి, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గానికి చెందిన విద్యార్థులు 12వ తరగతి అనంతరం ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆర్థిక సాయానికి కేంద్రం ప్రభుత్వం టాప్ క్లాస్ పథకం కింద ఉపకార వేతనాన్ని అందిస్తోంది. 2026-27 విద్యా సంవత్సరంలో దాదాపు 2,000 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యా ఖర్చులు పుస్తకాలు, స్టేషనరీ, ల్యాప్‌టాప్ తదితర అవసరాల కోసం మొదటి ఏడాదికి రూ.86 వేలు, తర్వాత ప్రతి ఏడాదికి రూ.41 వేలు చొప్పున అందిస్తారు. ప్రైవేటు విద్యా సంస్థలో ట్యూషన్ ఫీజుతోపాటు ఇతర ఫీజులు కూడా పూర్తిగా చెల్లిస్తారు.

### ఎస్సీ విద్యార్థులకు టాప్ క్లాస్ పథకం

**అర్హతలు**

✦ ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థులై ఉండాలి. ✦ కుటుంబ వార్షికాదాయం అన్ని వనరుల నుంచి రూ.8 లక్షల వరకు ఉండాలి. ✦ గుర్తింపు పొందిన సంస్థలో రెగ్యులర్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ✦ మొదటి సంవత్సరం విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు ✦ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. 30 శాతం బాలికలకు కేటాయించారు.

### దరఖాస్తు విధానం

ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎం, ఎన్ఎల్‌యూల తోపాటు కేంద్ర, రాష్ట్ర గుర్తింపు కలిగిన ప్రముఖ సంస్థల్లో ప్రవేశాలు పొంది ఉండాలి. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా, ప్రవేశ ర్యాంకు, ఫీజు వివరాలను పొందుపర్చాలి.

### ముఖ్యమైన అంశాలు

☛ ఒక కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ☛ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఇతర ఉపకార వేతనాలు పొందుతున్నవారు అనర్హులు ☛ విద్యార్థి తదుపరి తరగతికి ప్రమోట్ కాకపోతే ఉపకార వేతనం నిలిపివేస్తారు. ☛ దరఖాస్తుకు చివరి తేదీ: 2026 అక్టోబరు 31.

## రామప్ప శిల్పకళ అద్భుతం



శిల్పకళను తిలకిస్తున్న ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్‌రెడ్డి

**వెంకటాపూర్, న్యూస్‌టుడే:** యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణ చాతుర్యం, శిల్పకళా సంపద అద్భుతమేనని ఏటూరునాగారం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా రామప్పను సందర్శించారు. పూజారులు స్వాగతం పలికి, రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. జర్మనీకి చెందిన ముగ్గురు పర్యాటకులు సందర్శించారు. రామప్ప పరిసరాల్లో ప్రకృతి అందాలను వీక్షించారు. సరస్సులో బోటు షికారు చేశారు. వారివెంట ఆలయ ఈవో భాస్కర్, పురావస్తు, పర్యాటక, దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం



ముత్తారంలో రహదారి పనులు ప్రారంభిస్తున్న మంత్రి ప్రభాకర్

**భీమదేవరపల్లి, న్యూస్‌టుడే:** గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలంలో 'పల్లెపల్లెలో పొన్నమన్న... పల్లెపల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ముత్తారం, గొల్లపల్లి, ముస్తఫాపూర్, వీరభద్రనగర్, గట్లనర్సింగాపూర్, బొల్లోనిపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముత్తారం-లంబాడి తండా-గట్లనర్సింగాపూర్ రహదారి అభివృద్ధికి రూ.3.74 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, స్టీల్ బ్యాంకులను వినియోగించాలన్నారు. సౌర విద్యుత్తును ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడం నా బాధ్యత అని మంత్రి ప్రభాకర్ స్పష్టం చేశారు. గొల్లపల్లి బస్‌స్టేషన్ నుంచి ముత్తారం వరకు రూ.3.5 కోట్లతో తారు రోడ్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. వీరభద్రనగర్ పంచాయతీకి స్థలం ఇస్తే భవనానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, ఏడీఏ ఆదిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, సర్పంచులు ఊరడి భారతి, నేతల చంద్రమోహన్, గడ్డం సుజాత, కొర్ర గోపాల్, బొల్లంపల్లి అజయ్, బొల్లి మాసన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేశ్ పాల్గొన్నారు.

## రూ.కోట్లతో నిర్మించి.. కొనుగోళ్లు మరిచి!



నిరుపయోగంగా ఉన్న రేకుల షెడ్డు

**పర్వతగిరి(వర్ధన్నపేట), న్యూస్‌టుడే:** అన్నదాతలు పంటలు విక్రయించుకోవడానికి నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. దళారుల చేతుల్లో రైతులు మోసపోకూడదని సకల సౌకర్యాలతో పర్వతగిరి మండల కేంద్రంలో 1995లో అతిథి గృహంతో పాటు ధాన్యం, పత్తి, పసుపు ఆరబోసేందుకు షెడ్లు, గోదాంలు నిర్మించారు. వ్యవసాయ సబ్ మార్కెట్‌లో కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రైతులు ధాన్యం తదితర పంటలను తీసుకురావడం లేదు. దీంతో రూ.కోట్లతో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ప్రారంభించిన కొత్తలో అరకొరగా కొనుగోళ్లు నిర్వహించిన మార్కెట్ అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు. ప్రతి సంవత్సరం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, ప్రాథమిక సహకారం సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో 15 రోజుల పాటు రైతులతో కొంత సందడి నెలకొంటుంది. అనంతరం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కొనుగోలు, అమ్మకాలు లేని సబ్ మార్కెట్‌లో 2015లో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంతో పాటు ప్రత్యేక నిధులతో కళాతోరణం నిర్మించారు.

## బొగతలో పర్యాటకుల సందడి



**వాజేడు, న్యూస్‌టుడే:** పర్యాటకుల కేరింతలతో బొగత జలపాతం సందడిగా మారింది. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జలపాతం పరవళ్లు తిలకిస్తూ.. ఈత కొలనులో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఓవైపు చిరుజల్లులు, మరోవైపు జలపాతం నీటి తుంపరలతో పర్యాటకులు తడిసి ముద్దయ్యారు.

## ఉపాధ్యాయుల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

**హనుమకొండ విద్యా విభాగం, న్యూస్‌టుడే:** ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ సర్వసభ్య సమావేశం సంఘం బాధ్యులు మండల తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలన్నారు. మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు జీరో పద్దు కింద వేతనాలు అందించాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు సెప్టెంబరు 1న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.పట్టాభి, రవీందర్‌రెడ్డి, మహేందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేందుకు చలో దిల్లీ



దిల్లీకి తరలివెళ్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు బృందం

**కాజీపేట టౌన్, న్యూస్‌టుడే:** దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చలో దిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. సెప్టెంబరు 1న న్యూదిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన 'బద్లావ్ జరూరీ హై' (మార్పు తప్పనిసరి) మహా సభకు హనుమకొండ జిల్లా నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బయలుదేరారు. కాజీపేట రైల్వే జంక్షన్ ఎదుట శ్రీనివాస్‌రావు జెండా ఊపి పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, నేదునూరి జ్యోతి, కరుణాకర్, శ్రీనివాస్, భిక్షపతి, మద్దెల ఎల్లేష్, స్టాలిన్, రాజమౌళి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## త్రినగరి

### యువత క్రీడల్లో రాణించాలి



హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా యువత క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు సైక్లింగ్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన పలు క్రీడాంశాల్లో విజేతలకు ముఖ్య అతిథిగా ప్రభాకర్‌రెడ్డి హాజరై బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణ కలిగిన క్రీడాకారుల తమ లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీవైఎస్‌వో కొత్త ప్రశాంత్, జూడో సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్, హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శ్యామల పవన్, డీఎస్‌ఏ కోచ్‌లు ప్రభుదాస్, రమేశ్, నవీన్, విష్ణువర్ధన్, జీవన్ పాల్గొన్నారు.

### కనకదుర్గ కాలనీ పార్కు అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ డా.కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వడ్డేపల్లి, న్యూస్‌టుడే:** హనుమకొండ 59వ డివిజన్ కనకదుర్గ కాలనీలోని జీడబ్ల్యూఎంసీ పార్కు, కమ్యూనిటీ కేంద్రాన్ని ఆధునిక సౌకర్యాలతో మోడల్ పార్కుగా అభివృద్ధి చేస్తామని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం వారు పార్కును సందర్శించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, లైటింగ్, పచ్చదనం, మొక్కల నిర్వహణను పరిశీలించారు. వాకర్స్, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలం, మెరుగైన ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు, మహిళలు, యువత కోసం ధ్యానం హాలు, మెరుగైన ఓపెన్‌జిమ్, పటిష్ఠమైన లైటింగ్, భద్రతకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్, మున్సిపల్ అధికారులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

**రంగశాయిపేట, న్యూస్‌టుడే:** ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు ఆధ్వర్యంలో సోమవారం అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని రాజశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మదాసు రాజు కోరారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 33, 39 డివిజన్ల పరిధిలో ఆదివారం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

**చికెన్ ధరలు**
(కిలో వెల రూపాయలలో)

| వెన్‌కాబ్ | |
|---|---|
| ఫాం: | 117 |
| రిటైల్: | 144 |
| డ్రెస్డ్: | 223 |
| స్కిన్‌లెస్: | 252 |



## రాఖీ పండగకు మేనమామ ఇంటికి వచ్చి..

### కుంటలో పడి అన్నదమ్ముల మృత్యువాత



వినయ్ కిశోర్



రాజేశ్

**ములుగు క్రైం, న్యూస్‌టుడే:** రాఖీ పండగకు అమ్మతో కలిసి మేనమామ ఇంటికి వచ్చిన అన్నదమ్ములు నీటి కుంటలో పడి మృతి చెందిన విషాదకర ఘటన ఆదివారం ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన మాలోతు స్వాతి-యాకూబ్ దంపతులకు ఇద్దరు కుమారులు. వినయ్ కిశోర్ (16) మంగపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, రాజేశ్ (14) కమలాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రాఖీ పండగ కోసం ఈ నెల 28వ తేదీన తల్లి స్వాతితో కలిసి ములుగు మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌లాల్‌పల్లిలో ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చారు. స్వాతి తన సోదరుడు గణేశ్‌కు రాఖీ కట్టి. . కుమారులను మరుసటి రోజున రమ్మని చెప్పి శనివారం వెళ్లిపోయారు. మేనమామ ఇంటి వద్ద ఉన్న వినయ్ కిశోర్, రాజేశ్‌తో పాటు మరో బాలుడు సాయి కలిసి ఆదివారం గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో బహిర్భూమి కోసం శివారులో ఉన్న మొండికుంట వద్దకు వెళ్లారు. నీటిలోకి దిగిన అన్న వినయ్ కిశోర్ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. అతడిని కాపాడేందుకు తమ్ముడు రాజేశ్ చేయి అందిస్తూ అతనూ నీళ్లలో పడిపోయాడు. వారివెంట ఉన్న మరో బాలుడు సాయి పరుగున గ్రామంలోకి వెళ్లి చెప్పడంతో బంధువులు, గ్రామస్థులు కుంట వద్దకు చేరుకొని గాలించి మృతదేహాలను వెలికితీశారు. ఎస్సై రచిత్ర ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మేనమామ గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**స్పృహ కోల్పోయిన తల్లి..:** కమలాపూర్‌లో ఉన్న తల్లి స్వాతి కుమారుల మరణవార్త విని కన్నీరుమున్నీరుగా విలపించారు. రాత్రికి ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. తన కుమారులకు ఏమైందంటూ రోదించారు. స్పృహ కోల్పోవడంతో బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

## వేధింపులతో మహిళ ఆత్మహత్య

### ఇద్దరిపై కేసు నమోదు



రాజేశ్వరి

**వాజేడు, న్యూస్‌టుడే:** ఇద్దరు వ్యక్తుల వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు జిల్లాలో చోటు చేసుకొంది. పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కాట రాజేశ్వరి (26)ని అదే గ్రామానికి చెందిన కాట నవీన్, కావిరి రాజు వేధించేవారు. ఓ కేసు విషయంలో జైలుకు వెళ్లిన ఆమె భర్త ఇక బయటకు రాడని, తాము చెప్పినట్లు నడుచుకోవాలంటూ నిత్యం ఫోన్ చేసి బెదిరించేవారు. వారి నంబర్లు బ్లాక్ చేస్తే ఇతర నంబర్ల ద్వారా ఫోన్లు చేశారు. ఇంటి ముందు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఇబ్బందులకు గురిచేశారు. వారి వేధింపులు భరించలేక ఆమె ఈ నెల 26వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వారి వేధింపులు భరించలేకే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. తనకు చిన్న కుమారుడు ఉన్నాడని, తనను వేధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఆత్మహత్యకు ముందు సెల్‌ఫోన్ ద్వారా పంపిన వీడియో వివరాలు వెల్లడించారు. మృతురాలి తండ్రి బాబూరావు ఫిర్యాదు మేరకు నిందితులు కాట నవీన్, కావిరి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రవిచంద్ర

**గచ్చిబౌలి, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం. . హనుమకొండకు చెందిన వేముల రవిచంద్ర (25) బండ్లగూడలో ఉంటూ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని నిమిత్తం కొండాపూర్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 1:30 సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొండాపూర్ అర్బోర్ స్కూల్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ వాహన డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. రవిచంద్ర వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి.. టిప్పర్ వెనక చక్రాల కిందకు దూసుకెళ్లింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

**జనగామ రూరల్, న్యూస్‌టుడే:** హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై జనగామ మండలం పెంబర్తి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. జనగామ ఎస్సై చెన్నకేశవులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంబర్తికి చెందిన గుండ మల్లమ్మ, మల్లయ్య దంపతులు పెంబర్తి యూ-టర్న్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుకాలే నుంచి ఓ ద్విచక్రవాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో మల్లమ్మ(50) తలకు, మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లమ్మ మృతిచెందారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వృద్ధుడి బలవన్మరణం

**ధర్మసాగర్, న్యూస్‌టుడే:** కాజీపేటకు చెందిన చంద బుచ్చయ్య (65) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మసాగర్ ఎస్సై దిలీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కాజీపేటకు చెందిన బుచ్చయ్య మద్యానికి బానిసై శనివారం సాయంత్రం తన ఇంట్లో వారితో ఘర్షణ పడి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. బుచ్చయ్య కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## మెరుగుపడనున్న విద్యుత్తు సరఫరా

**కేసముద్రం (ఇనుగుర్తి), న్యూస్‌టుడే:** కేసముద్రం పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు లోవోల్టేజీ, విద్యుత్తు అంతరాయాల సమస్యలు తీరనున్నాయి. సోమవారం కేసముద్రం విలేజ్‌లో రూ.1.90 కోట్లతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, ఎంపీ బలరాం నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రిమోట్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్‌ఎంఎస్) విధానంలో ఎస్పీడీసీఎల్ ఈ ఉపకేంద్రాన్ని నెలకొల్పింది. నాలుగు ఫీడర్లతో నిర్మించిన ఈ ఉపకేంద్రం ద్వారా కేసముద్రం పట్టణానికి అవసరమైన విద్యుత్తును అందించనున్నారు.


ప్రారంభం కానున్న 33/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రం

**కొత్త ఉపకేంద్రం పరిధిలో ఇలా**
- గృహాలు: 2,050
- కేటగిరి-2 : 1,526
- కేటగిరి-3, పరిశ్రమలు: 49
- వ్యవసాయ బావులు: 1,700

## నేడు పురపాలక కార్యాలయం ఎదుట ధర్నా

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** మహబూబాబాద్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలపై సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పది గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్తు, వీధి దీపాల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

## నూతన కమిటీ ఎన్నిక

**గార్ల, న్యూస్‌టుడే:** గార్ల మండలం ఎరువులు, విత్తనాలు పురుగుమందుల డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం మర్రిగూడెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో జరిగింది. అధ్యక్షుడిగా డి. వీరన్న, కార్యదర్శిగా టి. తిరుపతిరావు, కోశాధికారిగా జి. నరేందర్, ఉపాధ్యక్షుడిగా అఫ్జల్, గౌరవ అధ్యక్షుడిగా విద్యాసాగర్, మనోజ్‌కుమార్‌అగర్వాల్, లింగాల ఉమేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్లు హాజరయ్యారు.


వీరన్న

# బోధన ఎలా సాగుతోంది..!

### నేటి నుంచి పాఠశాలలకు తనిఖీ బృందాలు

**మానుకోట, న్యూస్‌టుడే:** విద్యావిషయక అంశాల అమలు, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించేందుకు ఉపాధ్యాయులతో కూడిన తనిఖీ బృందాలు సోమవారం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించనున్నాయి. ప్రాథమిక పాఠశాలల తనిఖీకి ఆరు బృందాలు, ప్రాథమికోన్నత పాఠశాలలను ఒక బృందం ఆయా పాఠశాల సముదాయాల పరిధిలో ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో నోడల్ అధికారితో పాటు మరో ఇద్దరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో కలిపి మొత్తం ముగ్గురు సభ్యులుంటారు. ప్రాథమిక పాఠశాలల బృందానికి నోడల్ అధికారిగా ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, యూపీఎస్ బృందానికి ఓ స్కూల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఈ బృందాలు జిల్లాలోని 559 ప్రాథమిక, 77 యూపీఎస్‌లను తనిఖీ చేస్తాయి.

**పూర్తిస్థాయిలో బాధ్యతలు**

ఈ బృందాల్లోని ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో బాధ్యతలను నిర్వర్తించాలి. వారు పనిచేసే పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. బృందంలోని ప్రతి సభ్యుడికి జిల్లా పర్యవేక్షణ అధికారి (ఏఎంఓ) కొన్ని పాఠశాలలను కేటాయిస్తారు. ఆ పాఠశాలలను సందర్శిస్తూ బృందంతో సమన్వయం చేసుకోవాలి. పాఠశాలల్లో కనీసం రెండు సబ్జెక్టుల బోధనను పరిశీలించి తెలంగాణ పాఠశాల విద్య యాప్‌లో నమోదు చేయాలి.

**ఎఫ్‌ఎల్‌ఎన్ అమలుపై ప్రత్యేక దృష్టి**

పాఠశాలల్లో తొలిమెట్టు పేరిట అమలవుతున్న ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమంపై తనిఖీ బృందాలు ప్రధానంగా దృష్టి పెడతాయని ఏఎంఓ మోత్కూరి వెంకటేశ్వర్లు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. ప్రాథమిక తరగతుల్లో బోధన, ప్లానింగ్, టీఎల్‌ఎం వినియోగం, వర్క్‌షీట్లతో సాధన చేయిస్తున్నారా తదితర అంశాలపై సమగ్ర పరిశీలన జరుగుతుంది. ఈ మేరకు తనిఖీ బృందాలకు సమగ్రమైన ప్రశ్నావళిని అందజేశాం.

## శిథిలావస్థలో రైతు వేదికలు

**మరిపెడ, న్యూస్‌టుడే:** అధికారుల నిర్లక్ష్యంతో రైతు వేదికలు శిథిలావస్థకు చేరుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి గాని మధుసూదన్ ఆరోపించారు. ఆదివారం అబ్బాయిపాలెం శివారు పత్తికుంట తండా రైతు వేదికను సీపీఎం నాయకులు పరిశీలించారు. అబ్బాయిపాలెం, అమృనాయక్‌తండా, ధారావత్‌తండ, గాలివారిగూడెం గ్రామాలతో పాటు మరిపెడ పురపాలిక పరిధిలోని సుమారు 5 వేల మంది రైతులకు ఉపయోగపడేలా రూ.23 లక్షలతో నిర్మించిన రైతు వేదిక రెండేళ్ల కిందట భారీ వర్షాలకు దెబ్బతిన్నా మరమ్మతులు చేపట్టలేదన్నారు. వెంటనే మరమ్మతులు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు బాణాల రాజన్న, ఉప్పలయ్య, వెంకన్న, సైదులు పాల్గొన్నారు.


రైతు వేదిక వద్ద మాట్లాడుతున్న మధుసూదన్

## మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

**మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే:** రామచంద్రపురం కాలనీ పలువీధుల్లో వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. రాత్రి సమయంలో స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **-వీణ**

**సమాధానం:** వీధి దీపాలకు మరమ్మతు చేయిస్తాం. **- కుమార్, మున్సిపల్ ఏఈ.**

**మహబూబాబాద్ టౌన్:** ఆర్‌యూబీ అండర్ పాస్ మార్గంలో వీధి కుక్కల స్వైరవిహారం అధికంగా ఉంది. రాత్రి సమయంలో రహదారి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. **-రాములు**

**సమాధానం:** సిబ్బందితో వీధి కుక్కలను ఏబీసీ సెంటర్‌కు తరలించేలా చర్యలు తీసుకుంటా **- కరుణాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొత్తబజార్**

### గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు

**పెద్దవంగర, న్యూస్‌టుడే:** తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గేట్‌వాల్వ్ మరమ్మతుకు గురికావడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని సర్పంచి పారిజాత దృష్టికి తీసుకెళ్లగానే మరమ్మతులు చేయించారు.

### వీధిదీపాలకు..

**తొర్రూరు, న్యూస్‌టుడే:** డివిజన్ కేంద్రంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌కు వెళ్లేరోడ్డులో పలు వీధిదీపాలు మరమ్మతుకు గురై వెలగడం లేదు. ఈ సమస్యపై ' వీధి దీపాలు మరమ్మతు చేయాలి' శీర్షికన 'మేమున్నాం మీకు తోడు'గా కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. సిబ్బందిచే మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించారు.

## కాంగ్రెస్ మోసాలపై భారాస ప్రచారం

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీలను అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేస్తోందని.. వాటిని ప్రజలకు వివరించేందుకు వచ్చే నెల రెండో తేదీ నుంచి వారం రోజులు వివిధ అంశాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం మానుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడారు. భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు నియోజకవర్గంలో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ 100 రోజుల్లో హామీలు నెరవేరస్తామని చెప్పి వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదని భస్మాసుర హస్తమని శంకర్‌నాయక్ ఆరోపించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువకులను మోసం చేసిందన్నారు. కేసముద్రం మండలం నారాయణపురంలో తామిచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను కాంగ్రెస్ ఇస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పీఏసీఎస్ ఛైర్మన్ నాయిని రంజిత్, పురపాలక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ.ఫరీద్, నాయకులు తేళ్ల శ్రీనివాస్, అశోక్, ఆవుల వెంకన్న, యాకూబ్‌రెడ్డి, నరేష్, శ్రీనాథ్, కాశీం, లింగస్వామి, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

## తిరగని పంకాలు.. బోగీలో ముచ్చెమటలు

**డోర్నకల్, న్యూస్‌టుడే:** రైలులో తిరగని పంకాలతో ప్రయాణికులు అవస్థలు పడ్డ ఉదంతం ఇది. గుంటూరు-సికింద్రాబాద్ మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...డోర్నకల్‌లో రైలెక్కిన ప్రయాణికులు జనరల్ బోగీ (నంబరు 171318)లో పంకాలు తిరగడం లేదని గమనించారు. తోటి ప్రయాణికులను ఆరా తీస్తే రైలు బయలు దేరినప్పటి నుంచి ఇదే పరిస్థితి అని, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. దీంతో డోర్నకల్‌కు చెందిన ఓ ప్రయాణికుడు ఫిర్యాదు నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. స్పందించిన అధికారులు మరమ్మతులకు సిబ్బందిని పురమాయించారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలు ఆగగానే బోగీలోకి ఎక్కి పరిశీలించారు. సాంకేతిక లోపం కనిపించలేదు. అదే బోగీలో ప్రయాణించి రెండు బోగీల మధ్య ఉండే బాక్సులో సమస్య ఉండవచ్చని అభిప్రాయానికి వచ్చారు. రైలు కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆగగానే అందులో లోపం గుర్తించి సరి చేశారు. ఎట్టకేలకు పంకాలు పని చేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.


కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మరమ్మతు చేస్తున్న సిబ్బంది

## ప్రజావాణి వేదిక మార్పు

**దంతాలపల్లి, న్యూస్‌టుడే:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రైతు వేదికలో కాకుండా మండల పరిషత్తు కార్యాయలంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సక్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనే వారంతా మండల పరిషత్తు కార్యాలయానికి రావాల్సిందిగా కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు వినతులను సమర్పించవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

## ఐక్య ఉద్యమాలతోనే రాజ్యాధికారం సాధ్యం

**తొర్రూరు, న్యూస్‌టుడే:** సమాజంలో ఎనభై శాతానికి పైబడి ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉద్యమిస్తేనే రాజ్యాధికారం సాధ్యమని బీసీ మేధావుల ఫోరం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూరపాటి రమేష్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని అతిథి గృహంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో మనమెంతో...మనకంత వాటా నినాదంతో ముందుకుసాగాలన్నారు. ఒకే బావజాలాన్ని కలిగి ఉండి ఏకతాటిపై ముందుకుసాగితే రాజ్యాధికారం కష్టమేమీకాదన్నారు. అసమానతల కారణంగా రాష్ట్రంలో విద్య, వైద్య, సంక్షేమం కుంటుబడిపోతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, చందా మల్లయ్య, ఉపేందర్, డాక్టర్ పి. అశోక్, వెంకన్నగౌడ్, ప్రవీణ్‌రాజు, ఐలయ్య, శ్రీనివాస్, రాయిశెట్టి ఉపేందర్ పాల్గొన్నారు.


ఐక్యత ప్రదర్శిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు

## దీక్ష యాప్‌లో నమోదు చేసుకోవాలి

**మానుకోట, న్యూస్‌టుడే:** జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు దీక్ష యాప్‌లో విధిగా ఈ నెల 31 సాయంత్రం 5 గంటల్లోగా నమోదు చేసుకుని నిర్దేశిత కోర్సులను పూర్తి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ మూర్తి కోరారు. నమోదు తర్వాత సెప్టెంబర్ ఒకటి నుంచి 10 వరకు ఆయా కోర్సులు పూర్తి చేయవచ్చని 11 నుంచి 14 వరకు సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించడం దీక్ష కోర్సుల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## గుంటల్లో నీరే.. పంటలకు రక్ష

**తొర్రూరు, న్యూస్‌టుడే:** వర్షాలు ముఖం చాటెయ్యడంతో రైతులు సాగుచేసిన పంటలకు నీటి తిప్పలు తప్పేలా లేదు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు నీరందించడానికి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నచిన్న జలవనరులను కూడా వినియోగించుకుంటున్నారు. సోమారపుకుంట తండ గ్రామపంచాయతీ శివారులో ఉన్న కుంటలో ఉన్న నీటిని రైతులు మోటార్ల సహాయంతో దూరప్రాంతాల్లో సాగుచేసిన వరిపంటకు నీళ్లందిస్తున్నారు.



## 'అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి'

**కొత్తగూడ, న్యూస్‌టుడే:** గిరిజన సంక్షేమశాఖలో జరిగిన అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు అక్రమ డిప్యుటేషన్లపై మైదానప్రాంతాలకు వెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో ఇక్కడి పాఠశాలలు మూసివేతకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు విజయ్‌కుమార్, సోమయ్య, జంపయ్య, రమేశ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రవి

## నిలిచిన పనులు.. తప్పని కష్టాలు

**కొత్తగూడ, న్యూస్‌టుడే:** కొత్తగూడలో రోడ్డు విస్తరణ పనులతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం రూ.12 కోట్ల నిధులను విడుదల చేయగా నవంబర్ 22న పనులు ప్రారంభమయ్యాయి. కొత్తగూడలోని వ్యాపార దుకాణాల ముందున్న రేకులను తొలగించి రహదారి విస్తరణ చేపట్టారు. గాంధీనగర్ నుంచి ఠాణా వరకు, అంబేడ్కర్ కూడలి నుంచి బూర్కవానిగుంపు అంగడి వరకు గుంజేడురోడ్డులో విస్తరణ పనులు మొదలయ్యాయి. గాంధీనగర్ నుంచి ఠాణా వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో మొదటి వరుస బీటీని వేసి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు నిమిత్తం డివైడర్‌ను నిర్మించారు. దీనిపై రెండో వరుస బీటీ వేయాల్సి ఉండగా గుంజేడు రోడ్డు, కొత్తపల్లి రోడ్డులో పాతతారును తొలగించి కంకర పోశారు. మూడు నెలల నుంచి తారు వేయకపోవడంతో కంకరపైనే వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ త్వరలోనే మిగతా పనులను పూర్తిచేసేలా చర్యలు చేపడతామన్నారు.


కొత్తగూడలో నిలిచిపోయిన రోడ్డువిస్తరణ పనులు

## ప్రాంగణం.. ప్రైవేటు వాహనాలకు నిలయం



**సీరోలు (కురవి), న్యూస్‌టుడే:** సీరోలు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ ప్రైవేట్ వాహనాలకు నిలయంగా మారింది. ఇక్కడ బస్టాండు నిర్మించిన కొన్ని సంవత్సరాల పాటు బస్సులు బాగానే ఆవరణలోకి వెళ్లి వచ్చేవి. ఆటోల సంఖ్య పెరగడంతో మానుకోటకు వెళ్లే ఆర్టీసీ బస్సును రోజుకు రెండు ట్రిప్పులకు కుదించారు. వచ్చిన బస్సును కూడా బస్టాండ్‌కు వెళ్లకుండా బయట నుంచే మళ్లిస్తున్నారు. దాంతో బస్టాండ్ ఆవరణ ఖాళీగా ఉండడంతో ట్రాక్టర్లు, వరి కోత మిషన్లకు నిలయంగా మారింది.

## ఏకగ్రీవ ఎన్నిక

**మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే:** ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడిగా మానుకోట పట్టణానికి చెందిన బి.అజయ్‌సారథిరెడ్డి, కార్యదర్శిగా రేషపల్లి నవీన్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా వెలుగు శ్రావణ్‌ను ఏకగ్రీవ ఎన్నిక చేసినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


అజయ్‌సారథిరెడ్డి నవీన్

## ప్రతిమల అపహరణ

**గంగారం, న్యూస్‌టుడే:** గంగారం మండలం మడగూడెం గ్రామంలో కొలువైన చుంచ వంశీయుల ఇలవేల్పు బాల కుమారస్వామి ప్రతిమలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాల కుమారస్వామి గర్భగుడి వద్ద కొందరు క్షుద్ర పూజలు నిర్వహించినట్లు గ్రామస్థులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గూడూరు సీఐ వినయ్, గంగారం ఎస్సై కోటేశ్వరరావు ఆదివారం సంఘటనాస్థలిని పరిశీలించారు. పూజారులు చుంచ చంద్రయ్య, గ్రామ పెద్దల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## వనదేవతల సన్నిధిలో భక్తుల రద్దీ

**తాడ్వాయి, న్యూస్‌టుడే:** వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొనేందుకు ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి గద్దెల ప్రాంగణానికి వచ్చి దేవతలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనూహ్యంగా పెరిగిన భక్తులతో మేడారంలో జాతర వాతావరణం నెలకొంది.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## జనావాసాల మధ్యకు కొండచిలువ

**కేసముద్రం (ఇనుగుర్తి), న్యూస్‌టుడే:** కేసముద్రం పుర పరిధిలోని కిష్టాపురం వీధిలో శనివారం రాత్రి కొండచిలువ జనవాసాల మధ్య కనిపించింది. స్థానికులు గమనించి అక్కడికి చేరుకునే సమయంలో పొదల్లోకి వెళ్లిపోయింది. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**నెల్లికుదురు, న్యూస్‌టుడే:** మండలంలోని రామన్నగూడెం, నెల్లికుదురులో ఇటీవల మృతి చెందిన కాసం లక్ష్మారెడ్డి, హెచ్.ఆలివేలు కుటుంబాలను రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆదివారం పరామర్శించారు. డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమ, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంట సంజీవరెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు బి.శ్రీనివాస్, పులి వెంకన్న, మండల అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు హెచ్.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ మాజీ అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, బాలాజీనాయక్, శ్రీపాల్‌రెడ్డి, సతీష్, రాజేష్ తదితరులున్నారు.

## వేగనియంత్రికలు ఏర్పాటు చేయాలని నిరసన

**మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే:** స్థానిక మూడు కొట్ల కూడలి తాళ్లపూసపల్లి ప్రధాన రహదారిలోని ఇందిరానగర్‌కాలనీ వద్ద వేగనియంత్రికలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం సీపీఐ పట్టణకమిటీ ఆధ్వర్యంలో రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నర్రా శ్రావణ్, మంద శంకర్, తండా శ్రీనాథ్, రాజు, మహ్మద్ రఫీ, జక్కుల నరేష్, యాకయ్య, పాషా, ఫజల్, శ్రీనివాస్ తదితరులున్నారు.



## నేత్ర దానంతో మరొకరికి చూపు

**కాజీపేట, న్యూస్‌టుడే:** నేత్ర దానం చేయడం వల్ల మరొకరికి చూపు లభిస్తుందని హసన్‌పర్తి ప్రాథమిక వైద్యశాల నేత్ర వైద్యుడు ప్రతాపగిరి ప్రసాద్ అన్నారు. ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ వృద్ధాశ్రమంలో 41వ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి నేత్ర దానంపై అవగాహన కలిగించారు. శ్రీనివాసురెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు చోటూ, యాకూబీ పాల్గొన్నారు.

## హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం మార్పు

**హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు నగరంలోని సర్క్యూట్ అతిథి గృహంలోని హనుమకొండ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా పరిషత్తు ఛైర్మన్ అతిథి గృహంలోకి మార్చినట్లు తహసీల్దార్ జి.రవీందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మంగళవారం నుంచి కార్యాలయంలో పూర్తి సేవలు అందుబాటులో ఉంటాయని, మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే 'చలో దిల్లీ'

**గిర్మాజీపేట, న్యూస్‌టుడే:** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసర సరకుల ధరలు, ప్రజాస్వామ్య హక్కుల హననం, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే 'చలో దిల్లీ' కార్యక్రమం చేపట్టినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా తెలిపారు. సీపీఐ పిలుపు మేరకు సెప్టెంబరు ఒకటో తేదీన న్యూదిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన 'బద్లావ్ జరూరీ హై' (మార్పు తప్పనిసరి) సభలో పాల్గొనేందుకు ఆదివారం సీపీఐ జిల్లా నాయకులు, కార్యకర్తల బృందం దిల్లీకి పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, విద్వేషపూరిత విధానాలతో కార్మికులు, కర్షకులు, యువత, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండె బద్రి, చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, గోవర్ధనచారి పాల్గొన్నారు.


వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి దిల్లీకి బయల్దేరిన సీపీఐ నాయకులు

## వరంగల్ సర్కిల్‌లో కొనసాగించాలని వినతి

**కేసముద్రం రూరల్, న్యూస్‌టుడే:** మహబూబాబాద్ ట్రాన్స్‌కో సబ్‌డివిజన్‌ను వరంగల్ సర్కిల్‌లోనే కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తానని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి కార్మికులకు హామీ ఇచ్చారు. జిల్లా ట్రాన్స్‌కో కార్మిక సంఘాల నాయకులు ఆదివారం మండలంలోని అర్పనపల్లి గ్రామంలోని వేం నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లాను జనగామ సర్కిల్‌లో విలీనం చేయడం వల్ల ఉద్యోగులు, కార్మికులు పరిపాలన, సేవాపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని నాయకులు ఎంపీకి విన్నవించారు. వరంగల్ ట్రాన్స్‌కో సర్కిల్‌లోనే మహబూబాబాద్ సబ్‌డివిజన్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మహబూబాబాద్ సబ్‌డివిజన్‌ను వరంగల్ సర్కిల్‌లోనే కొనసాగించేలా కృషి చేస్తామన్నారు. అవసరమైతే జనగామ ట్రాన్స్‌కో సర్కిల్‌ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐకాస అధ్యక్షుడు బందు శ్రీకాంత్, నాయకులు ఇస్మాయిల్, విద్యాసాగర్, కాసిం, సంధ్య, రుమానా తదితరులున్నారు.


వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ట్రాన్స్‌కో కార్మికులు

## విద్యుత్తు సవరణ బిల్లుతో ముప్పు

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్తు సవరణ బిల్లు చట్టంగా మారితే అన్ని వర్గాలకు ముప్పుగా మారుతుందని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాగుల రమేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను దశలవారీగా ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగా విద్యుత్తు సవరణ బిల్లు తెచ్చి చట్టం చేయాలని చూస్తోందన్నారు. ఈ చట్టం ఫలితంగా పేదరైతులకు, పేదలకు ఉచిత విద్యుత్తు అందకుండా పోతుందన్నారు. కార్మికులను కూడా తొలగిస్తుందన్నారు. కార్మికుల ఐక్యతను దెబ్బతీసే విధంగా తెస్తున్న చట్టాలను వ్యతిరేకిస్తూ ఐక్యంగా పోరాటాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి, కార్మిక సంఘం నాయకులు కందుకూరి శ్రీనివాస్, డి. వీరన్న, రాజేందర్, జయరాజు, సులోచన, ఖదీర్, శ్రీశైలం, అప్పిరెడ్డి, శ్రీనివాస్, సంపూర్ణ, తిరుపతమ్మ, ముత్తన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్